క్లుప్తంగా

వనిపాకలలో బేటీ బచావో.. బేటీ పడావో

చిట్యాల: మండలంలోని వనిపాకల గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులకు జిల్లా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ ఘూన్సీరాణి బాల్య వివాహాలు, బాలికల, యువతుల అక్రమ రవాణ, లింగ వివక్ష, గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజా, హెచ్‌ఎం బాణాల శ్రీనయ్య, అంగన్‌వాడీ టీచర్లు మేడి జానకమ్మ, ఇందిరా, అరుణ, అపర్ణ, జ్యోతి, ఉపాధ్యాయులు సైదులు, సునిత పాల్గొన్నారు.

సమావేశాన్ని జయప్రదం చేయాలి

చండూరు: నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో వచ్చే నెల 3న జరిగే సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. శుక్రవారం చండూరు మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. మండల సహాయ కార్యదర్శి ధనంజయ్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, సీపీఎం సీనియర్ నాయకులు చిట్టిమల్ల లింగయ్య, సీపీఎం మండల కమిటీ సభ్యులు కొత్తపల్లి నరసింహ, మహిళా సంఘం నాయకురాలు గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

రామగిరి (నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని కలెక్టరేట్ సమీపంలో కందుల బాలరాజు, వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా రాంపాటి శ్రీను, అశోక్, విశ్వప్రసాద్, శ్యామ్, సుబ్రహ్మణ్యం, శ్రీను అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో నిర్మల, అనురాధ, భార్గవి, మణికంఠ, మహదేవ్, తేజస్విని, తరుణ్, తనిష్క పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి గ్యారంటీ హామీలు అందించాలి

చండూరు: కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీ హామీలు ప్రతి పేదవాడికి అందించాలని సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్ కోరారు. శుక్రవారం చండూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోటి వెంకన్న, యాదయ్య, పరమేష్, శ్రీను, చెరుకు లింగస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సేవలను ప్రతి ఖాతాదారుడు సద్వినియోగం చేసుకోవాలని మర్రిగూడ ఏపీజీవీబీ మేనేజర్ సీహెచ్ తులసీరావు కోరారు. శుక్రవారం మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లిలో ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించారు. ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, నక్క బుగ్గరాములు, సైదులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

మాలధారులకు ముస్లిం స్నేహితుడి అన్నదానం


అయ్యప్ప మాల ధరించిన తన స్నేహితులకు అన్నదానం చేస్తున్న జాని

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన చిట్యాల రవిచందర్, పెరమల్ల రవి, బెల్లి సందీప్‌లు అయ్యప్ప మాల ధరించారు. ఈ సందర్భంగా వీరి స్నేహితుడైన ఎస్‌కే జాని వీరికి శుక్రవారం తన ఇంటిలో భిక్ష ఏర్పాటు చేశాడు. దీంతో మతాల కన్నా స్నేహబంధం ఎంతో గొప్పదని పలువురు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చిట్యాల: చిట్యాల పోలీస్‌స్టేషన్ ఎదురుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన తాపీ మేస్త్రీ సంఘం జిల్లా అధ్యక్షుడు పాల భిక్షంతో పాటు బోడ యాదయ్య బైక్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిని దాటుతున్నారు. నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్ వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న భిక్షంతో పాటు యాదయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

● బెంబేలెత్తిస్తున్న కుక్కలు

మునుగోడు: మునుగోడులో వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రి సమయంలో బయటకు రావాలంటేనే జంకుతున్నారు. నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల వెంట పడుతుండడంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. ఒక్కో వీధిలో సుమారు 50 కుక్కల వరకు సంచరిస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కుక్కలను పట్టుకుని అడవులకు తరలించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


మునుగోడులో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

● స్వచ్ఛభారత్ రిక్షాలు చెత్త పాలు

మునుగోడు: చెత్త సేకరించేందుకు కేంద్రం అందించిన స్వచ్ఛ భారత్ రిక్షాలు చెత్త పాలవుతున్నాయి. 2012లో ప్రతి గ్రామ పంచాయతీకి మూడు నుంచి పది వరకు రిక్షాలు అందించింది. కానీ వాటిని వినియోగించకుండా చెత్త కుప్పలో పడేస్తున్నారు. మునుగోడు మండలం ఊకొండి గ్రామపంచాయతీకి అందజేసిన రిక్షా ఇలా చెత్తకుప్పలో దర్శనమిచ్చింది. నిరుపయోగంగా పడి ఉన్న రిక్షాలను వేలం వేసి అవసమున్న వారికి అందించాలని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.


ఊకొండి పంచాయతీ కార్యాలయం వెనుక పడేసిన స్వచ్ఛభారత్ రిక్షాలు

అభివృద్ధికి నోచుకోని రోడ్లు

- అధ్వానంగా మారిన శాలిగౌరారం – గురజాల రోడ్డు
- నిధులు మంజూరై సంవత్సరం గడిచినా నేటికీ చేపట్టని పనులు


అధ్వానంగా మారిన శాలిగౌరారం- గురజాల ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు

శాలిగౌరారం: మండలంలోని రోడ్లు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా మారాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లతో పాటు పంచాయతీరాజ్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. శాలిగౌరారం- నకిరేకల్ ప్రధాన రోడ్డును మినహాయిస్తే మిగిలిన రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్ల అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో రూ. 9.80 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులకు సంబంధించి అన్ని రకాల అనుమతులు కూడా మంజూరై సంవత్సరం గడిచినా.. నేటికీ రోడ్ల అభివృద్ధి పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

నిధులు మంజూరైనా..

శాలిగౌరారం నుండి గురజాల వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ సింగిల్‌రోడ్డును రెండు కిలోమీటర్ల పొడవు రామగిరి శివారు వరకు డబుల్‌రోడ్డుగా అభివృద్ధి పరిచేందుకు సీఆర్‌ఎఫ్ నుంచి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో 1.60 కిలోమీటర్లు బీటీ డబుల్ రోడ్డు, 400 మీటర్లు సీసీ డబుల్‌రోడ్డు వేయాలి. రోడ్డు నిర్మాణానికి పరిపాలనా, ఆర్థిక, సాంకేతిక అనుమతులు కూడా వచ్చాయి. కానీ పనులు చేపట్టలేదు.

బీటీ రోడ్ల రెన్యూవల్‌కు రూ.4.80 కోట్లు

మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లలోని ఓడీఆర్ (ఆర్డినరీ డిస్ట్రిక్ట్ రోడ్డు) అభివృద్ధి చేసేందుకు రూ.4.80 కోట్లు మంజూరయ్యాయి. ఈదులూరు–మనిమద్దె రోడ్డును రూ. 1.80 కోట్లతో బీటీ రెన్యూవల్ పనులు చేపట్టారు. అందులో 2 కిలోమీటర్లు బీటీ రెన్యూవల్ జరగగా.. తక్కెళ్లపహాడ్‌లో 800 మీటర్లు సీసీరోడ్డు, ఎన్‌జీ కొత్తపల్లిలో 500 మీటర్లు సీసీరోడ్డు నిర్మించారు. శాలిగౌరారం–మాదారంకలాన్ రోడ్డులో పావురాలగూడెం బస్టాప్ నుంచి చొల్లగూడెంలోని 365 నంబర్ జాతీయ రహదారి వరకు 7 కిలోమీటర్లు బీటీ రెన్యూవల్ పనులకు రూ.3కోట్లు మంజూరయ్యాయి. అందులో 6.2 కిలోమీటర్లు బీటీ రెన్యూవల్ చేపట్టాల్సి ఉంది. పావురాలగూడెంలో 300 మీటర్లు సీసీరోడ్డు నిర్మించారు. ఊట్కూరులో 500 మీటర్లు సీసీరోడ్డు నిర్మించాల్సి ఉంది.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.9.80 కోట్లు మంజూరయ్యాయి. పనులకు సంబంధించి అన్నిరకాల అనుమతులు వచ్చాయి. ఇప్పటికే బీటీ రెన్యూవల్ పనులు కొంతమేర చేపట్టాం. డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– సంతోష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈ

సమన్వయంతో పనిచేయాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం


ఎమ్మెల్యే వీరేశంను సన్మానిస్తున్న ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి

నకిరేకల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం నకిరేకల్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల భవనాలు గత ప్రభుత్వం కూల్చివేసినందున వాటి పునర్నిర్మాణం చేపడతామన్నారు. మండలంలో ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు జాన్ శాస్త్రి, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్, తహసీల్దార్ ప్రసాద్‌నాయక్, ఎంఈఓ నాగయ్య, ఏఓ మల్లేషం, ఏపీఓ రమణయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కట్టంగూర్: మండలంలో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషిచేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సింగిల్ రోడ్లను డబుల్‌గా మార్చేందుకు కృషిచేస్తానని చెప్పారు. అయిటిపాములలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ సునీత, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు ఉన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత

చిట్యాల: చిట్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం చిట్యాల మున్సిపల్ పాలకవర్గ సాధారణ సమావేశానికి ఆయన మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ ఎన్నిక

నకిరేకల్: మండలంలోని ఓగోడు ఉపసర్పంచ్‌గా దుబ్బ నాగరాజు ఎన్నికయ్యారు. గతంలో ఉపసర్పంచ్‌గా ఉన్న సత్యనారాయణరెడ్డి రెండు నెలల క్రితం రాజీనామా చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. నాగరాజు, రమణ పోటీలో ఉన్నారు. మొత్తం సర్పంచ్‌తో 11 మంది సభ్యులు ఉండగా నాగరాజుకు మద్దతుగా ఆరుగురు, రమణకు మద్దతుగా ఐదుగురు నిలిచారు. నాగరాజును ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్లు కార్యదర్శి అంజయ్య ప్రకటించారు.

అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం


గణపతి పూజలో పాల్గొన్న భక్తులు

రామగిరి (నల్లగొండ): నల్లగొండలోని కనకదుర్గ కాలనీలో ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ, రక్షాబంధనం, దేవతాహ్వానం, మూల విగ్రహ అభిషేకాలు, అగ్ని ప్రతిష్ట, మార్గలి దీపోత్సవం, వేద స్వస్తి, శత రుద్ర భావన పూజలు నిర్వహించారు. శృంగేరి శారదాపీఠ ఆస్థాన పారాయణీకులు బాచంపల్లి సంతోష్ కుమార్ సనాతన సంప్రదాయ విశిష్టతపై ప్రవచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వర్కల బాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కున్‌రెడ్డి రామిరెడ్డి, కోశాధికారి మారం జగదీశ్వర్ రెడ్డి, వైదిక నిర్వాహకులు తోటపల్లి ఆనంద శర్మ, నిర్వాహకులు మారెడ్డి వెంకట్ రెడ్డి, జ్యోతి, విమల, లక్ష్మి, కాలనీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యసాధనతో విద్యార్థులకు బంగారు భవిష్యత్


వల్లాల మోడల్‌స్కూల్‌లో లక్ష్యసాధనపై అవగాహన కల్పిస్తున్న రామచంద్రన్

శాలిగౌరారం: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుతూ లక్ష్యసాధనతో ముందుకెళ్తే భవిష్యత్ బంగారు బాటలా మారుతుందని ఇంపాక్ట్ టీం డైరెక్టర్లు రామచంద్రన్, మాధవి అన్నారు. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా లయన్స్ క్లబ్ హంగరీ రిలీఫ్ కోఆర్డినేటర్ కెవి ప్రసాద్ సహకారంతో ×విద్యార్థి– భవిష్యత్® అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే లక్ష్యం, క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదల అలవర్చుకోవాలని తెలిపారు. పరీక్షలంటే భయాందోళన చెందొద్దని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ శిక్షకులు లక్ష్మీప్రసాద్, సోమ వెంకటేశ్వర్లు, వినోద్‌రెడ్డి, కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈఓ మారం గోనారెడ్డి, క్లబ్ అధ్యక్షుడు మారం వేణుగోపాల్‌రెడ్డి, ప్రతినిధులు బుడిగె శ్రీనివాసులు, రావిరాల అశోక్, బచ్చుపల్లి రవీందర్ రావు, మురారిశెట్టి కర్ణాకర్, పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

నల్లగొండ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికీ అందజేస్తామని జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 6 వరకు అన్ని గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించాలని, గడువు ముగిసినా ఆయా గ్రామాల కార్యదర్శులు దరఖాస్తులు తీసుకోవాలన్నారు. అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ ప్రతి నాలుగు నెలల కోసారి ఉంటుందని తెలిపారు. త్వరలోనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ–ముశంపల్లి–ధర్మాపురం రోడ్డుకు, గుండ్లపల్లి, నర్సింగ్‌బట్ల రోడ్డుకు, దోరేపల్లి–పగిడిమర్రి రోడ్ల విస్తరణకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ధరణిలో వివిధ సమస్యలపై 1,200 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఎంపీపీ సుమన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ సౌజన్య, పశువైద్యాధికారి సందీప్‌రెడ్డి, ఉద్యాన, పట్టు శాఖ అధికారి అనంతరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీఓ మాధవరెడ్డి, ఏపీఎం సైదులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మేకల అరవింద్‌రెడ్డి, గుండెబోయిన వెంకన్న యాదవ్, నారగోని నర్సింహగౌడ్, సైదులుగౌడ్, బీరం స్వాతి, పరమేష్, వెంకట్‌రెడ్డి, వెంకన్న యాదవ్, ఉపేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపుల నిషేధంపై తీర్మానం


కేతేపల్లిలో బెల్టు షాపుల నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

నాంపల్లి: మండలంలోని మహ్మదాపురం, కేతేపల్లి గ్రామాల్లో శుక్రవారం బెల్టు షాపుల నిషేధంపై గ్రామ సభలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు తీశారు. మద్యం అమ్మితే రూ.10వేల జరిమానా విధిస్తామని పంచాయతీ పాలకవర్గాలు తీర్మానం చేశాయి. ఆయా కార్యక్రమాల్లో మహ్మదాపురం సర్పంచ్ చంద్రారెడ్డి, కేతేపల్లి సర్పంచ్ హేమలత, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.


మహ్మదాపురంలో..

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే మందుల సామేల్


శాలిగౌరారం: ఉప్పలంచలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: అభివృద్ధి, ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం శాలిగౌరారం మండలంలోని శాలిలింగోటం, తుడిమిడి, ఉప్పలంచ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉప్పలంచలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అధికారులు, ప్రజాప్రతినిధులు జవాబుదారీగా పనిచేయాలన్నారు. ప్రజలు సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎలాంటి ఆందోళనకు గురికావద్దన్నారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఒక్క దరఖాస్తుతోనే ఆరు గ్యారంటీలలోని సంక్షేమ పథకాలు అమలులోకి వస్తాయని తెలిపారు. కాగా.. శాలిలింగోటంలో 221 దరఖాస్తులు, తుడిమిడి 217, ఉప్పలంచలో 248 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ ఎర్ర రణీల, మండల ఇన్‌చార్జి అధికారి శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ పాల్‌సింగ్, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ సుధాకర్, సర్పంచ్‌లు పాక మౌనిక, చలకాని రజిత, బండారు మల్లయ్య, ఎంపీటీసీలు పాక రాములు, నక్క శంకరమ్మ, ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, నాయకులు చాడ సురేశ్‌రెడ్డి, దండ అశోక్‌రెడ్డి, భూపతి అంజయ్య, గూని వెంకటయ్య, శ్రీను, రాములు పాల్గొన్నారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

మునుగోడు: ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కర్నాటి స్వామి కోరారు. శుక్రవారం మునుగోడు మండలంలోని కచలాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా చీకటిమామిడిలో నిర్వహించిన గ్రామసభలో తహసీల్దార్ నరేందర్, చండూరు సీఐ వెంకటయ్య పాల్గొని గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్ గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, సర్పంచ్‌లు గుర్జ అరుణ, తాటికొండ సంతోషసైదులు, ఎంపీటీసీ అనంత వీణలింగస్వామి పాల్గొన్నారు.

రెండవ రోజు 660 దరఖాస్తుల స్వీకరణ

రామగిరి(నల్లగొండ): తిప్పర్తిలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం కొనసాగింది. మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లి, రామలింగాలగూడెం, జంగారెడ్డిగూడెం, మర్రిగూడెం గ్రామాల్లో 660 దరఖాస్తులు స్వీకరించారు. మర్రిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పాశం రాంరెడ్డి పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, డీఈ నాగయ్య, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి భూమన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

కేతేపల్లి: ప్రజాపాలనలో భాగంగా శుక్రవారం కేతేపల్లి మండలంలోని రామచంద్రాపురం, పందెనపల్లి గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు పొందేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, సర్పంచ్‌లు సూరారపు ప్రియాంక, గద్దపాటి సీతమ్మ, ఎంపీటీసీ నల్లమాద వీరమ్మ, మాజీ జెడ్పీటీసీ సుంకరబోయిన నర్సింహ, రెడ్డిపల్లి సాగర్, మహేశ్వరం నాగేష్, తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ సునిత తదితరులున్నారు.

ప్రతి దరఖాస్తును పరిశీలిస్తాం

నాంపల్లి: ప్రజాపాలనలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలిస్తామని చండూరు ఆర్డీఓ దామోదర్‌రావు అన్నారు. నాంపల్లి మండలంలోని సుంకిశాల, నేరళ్లపల్లి, పెద్దాపురం, తుమ్మలపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. నేరళ్లపల్లిలో 560, పెద్దాపురం 500, సుంకిశాలలో 196, తుమ్మలపల్లిలో 371 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఎస్ నల్లగొండ శ్రీనివాస్, తహసీల్దార్ దేవాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ విశాక్, వెలుగు ఇన్‌చార్జ్ ఏపీఎం, సత్యనారాయణ, ఆర్ఐ దయాకర్‌రెడ్డి, మండల విస్తరణ అధికారి అనూష, సర్పంచ్‌లు బాషపాక రాములు, జల్లెల్ల వెంకటమ్మ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వీకరణ

చండూరు: గట్టుప్పల్ మండలంలోని శేరిగూడెం, చండూరు మండలంలోని గొల్లగూడెం, తిమ్మారెడ్డిగూడెం, చొప్పరివారిగూడెంలో శుక్రవారం ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి సురేష్ పరిశీలించారు.

కొనసాగుతున్న ప్రజాపాలన

మర్రిగూడ: ప్రజాపాలనలో భాగంగా శుక్రవారం మర్రిగూడ మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామంలో 539, శివన్నగూడలో 683, రాజాపేటతండాలో 196, తిరగండ్లపల్లిలో 314 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బక్కా శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, డీటీ జూటూరు తారకరామన్, సూపరింటెండెంట్ యాకుబ్, ఏపీఎం సంకు హరి, ఏపీఓ గుంటుక వెంకటేశం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మిర్యాల పద్మ, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు చిట్యాల సబిత, ఐతపాక జంగయ్య, ఆంబోతు సుధాకర్‌నాయక్, నూన్సావత్ సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు 1327 దరఖాస్తులు

నార్కట్‌పల్లి: మండలంలోని అక్కెనపల్లి, నెమ్మాని, శేరుబావిగూడెం, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన కొనసాగింది. ఆయా గ్రామాల్లో 1,327 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పద్మ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ యాదగిరి, ఎంఈఓ నర్సింహ, ఏఓ గిరిప్రసాద్, సూపరింటెండెంట్ ప్రదీప్, ఎంపీఓ సత్యనారయణ, ఆర్ఐ తరుణ్, ఉపసర్పంచ్ వడ్డె భూపాల్‌రెడ్డి, ఎల్లెందుల లింగస్వామి, గాయం శ్యాంసుందర్‌రెడ్డి, నవీన్, శివ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల కోసమే దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండ టూటౌన్: ఆరు గ్యారంటీల కోసమే దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు, నల్లగొండ ఆర్డీఓ రవి తెలిపారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో వారు దరఖాస్తులు స్వీకరించారు. రెండో రోజు అన్ని వార్డుల నుంచి 5,703 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ ఈఈ రాములు, డీఈలు పాల్గొన్నారు.


గంధంవారి గూడెంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు


నార్కట్‌పల్లి: అక్కెనపల్లిలో దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్


గట్టుప్పల్ మండలం శేరిగూడెంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ లావణ్య

పథకాలను ప్రజలకు చేరవేయాలి

నకిరేకల్: ప్రతి పథకం లబ్ధిదారులకు అందేలా చూడాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులకు సూచించారు. శుక్రవారం నకిరేకల్ మున్సిపాలిటీలోని 5, 14, 15, 16 వార్డులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్లు వంటిపాక సోమలక్ష్మి, గర్శకోటి సైదులు, లక్ష్మీవెంకన్న, స్వామి పాల్గొన్నారు.

ప్రజా పాలనతో సమస్యల పరిష్కారం

కేతేపల్లి: ప్రజాపాలనతో క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పోలు, కాసనగోడులో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ అశ్విని, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ హరికృష్ణ పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

చిట్యాల: లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. శుక్రవారం చిట్యాల మున్సిపాలిటీలోని 5వ వార్డులో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఖాజానజీం అలీ, డిప్యూటీ తహసీల్దార్ రాగ్యానాయక్, కమిషనర్ రామదుర్గారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చినవెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ పూలమ్మ పాల్గొన్నారు. పేరేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అంతటి వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.